# ది గెస్ట్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



## THE STORY OF A MAN, A WOMEN AND A CHILD

*( ప్రథమ ప్రచురణ - నవంబర్, 1988)*

### (గత సంచిక తరువాయి)

**"యం.డి.కి గూఢచారులెక్కువ" నవ్వింది ఆ సెక్షనులోని** ఇంకో అమ్మాయి మైత్రి, ప్యూన్ బయటకి వెళ్ళగానే.

"ఏం జరిగింది?" అడిగాడు స్టోర్ కీపర్ వెంటనే.

కేంటిన్‌లో మైత్రి మాటల గురించి చెప్పింది. అంతా విన్నాక ఆయన చిన్నగా నిట్టూర్చి, ఏం కామెంట్ చేయకుండా, మళ్ళీ స్టాక్ రిజిస్టర్‌లోకి తలదూర్చాడు.

పైట నిండుగా కప్పుకుని మైత్రి బెనర్జీ గదిలోకి అడుగుపెట్టగానే అతడు చిరునవ్వుతో 'గుడ్ మార్నింగ్' చెప్పాడు.

"గుడ్ మార్నింగ్. పిలిపించిన పని అఫీషియలా లేక పర్సనలా?" అడిగింది మైత్రి.

"రెండూను ముందు కూర్చో"

మైత్రి కుర్చీలో ఒద్దికగా కూర్చుంది. బెనర్జీ విలాసంగా రివాల్వింగ్ చెయిర్‌లో అటు, ఇటు ఊగుతూ చెప్పాడు.

"నిన్న మీ ఇంటికి వచ్చాను. లేవు"

"అవును. ఫ్రెండింటికి వెళ్ళాను"

"డాక్టర్, సుధీర్, నా బ్లడ్ రిపోర్ట్‌లని బట్టి ఆ కుర్రాడు నా కొడుకే అని నిర్ధారణ చేసాడు"

"నాకు తెలుసా సంగతి" జవాబు చెప్పింది మైత్రి.

"నేను చెప్పకుండా ఎలా తెలిసింది?" అడిగాడు బెనర్జీ ఆశ్చర్యంగా.

"నే చెప్పిందాంట్లో అబద్ధంలేదు. అదే రిపోర్ట్ వస్తుందని తెలుసు కాబట్టి"

సిగరెట్ వెలిగించి, బెనర్జీ లేచి వచ్చి మైత్రి ఎదురుగా టెబుల్ అంచుమీద కూర్చున్నాడు. ఓ దమ్ములాగి అడిగాడు.

"ఇప్పుడు చెప్పు. సుధీర్‌ని నాకివ్వడానికి బదులుగా నువ్వు కోరేది, అది నాకు మాత్రమే మంచి చేసేది, నీకెలాంటి స్వార్థం లేనిది అయిన అదేమిటో ఇప్పుడు చెప్పు"

మైత్రి బెనర్జీ కళ్ళలోకి చూసి చెప్పింది.

"ఒకటి మాత్రం తప్పనిసరి. నే కోరింది నీవు ఇవ్వలేకపోతే మాత్రం సుధీర్ సంగతి నువ్వు మర్చిపోవచ్చు"

"ఎట్టి పరిస్థితుల్లో సుధీర్‌ని నేను మర్చిపోను. ముఖ్యంగా నే ఉన్న పరిస్థితిలో. కమాన్. షూటిట్ ఐసే"

"ముందా సిగరెట్‌ని ఆర్పు"

అతను విస్మయంగా చూసాడు. ముందాపని చేయమన్నట్లుగా తలాడించింది మైత్రి. కొద్దిగా తటపటాయించి సిగరెట్‌ని టేబిల్ మీది ఏష్ ట్రేలో దాన్ని నలిపి ఆర్పేసాడు.

"ఇప్పుడు చెప్పు" అడిగాడు.

"ఒకటి ఆల్ రెడీ చేసేసావు. ఇంకో రెండు చెయ్యాలి."

అర్థం కానట్లుగా చూస్తున్న బెనర్జీతో చెప్పింది మైత్రి "ఇప్పుడు నువ్వార్పిన సిగరెట్ నీ జీవితంలో నువ్వు ఆఖరిసారిగా తాగిన సిగరెట్. సిగరెట్‌తో పాటు ఆల్కహాల్ కూడా పూర్తిగా మానేయాలి?"

ఇంకా అర్థం కానట్లుగానే చూస్తూ అడిగాడు.

"ఇదా నువ్వడిగేది?"

"అవును."

"ఎందుకు?" తెల్లబోయి అడిగాడు.

"ఆ రెండు ఆరోగ్యానికి హాని చేసేవి కాబట్టి."

"నువ్వేం చెపుతున్నావో నాకర్థమవటంలేదు."

"అయింది. కానీ నమ్మలేక పోతున్నావు. సుధీర్ నేను నీకు అప్పగించాలంటే సిగరెట్ మానాలి. మందు మానాలి. నాలాంటి నిస్సహాయులయిన ఆడవాళ్ళని ట్రాప్ చేయడం మానాలి. నువ్వా మూడు విషయాల్లో పూర్తిగా మారావన్న నమ్మకం నాకు కలిగించు. ఆ తర్వాత సుధీర్‌ని దత్తత చేసుకో" చెప్పింది మైత్రి.

"నిజమా? జోక్ చేస్తున్నావా?" అడిగాడు బెనర్జీ.

"నిజం."

"నువ్వు కోరేది ఇదంటే నమ్మశక్యం కావడం లేదు."

"ఇందులో నా స్వార్థం లేదు. నీ మంచి కోరే ఈ కండిషన్స్."

బెనర్జీ బల్ల అంచు మీంచి కిందకి దిగి ఆ గదిలో మౌనంగా నాలుగైదు సార్లు అటూ ఇటూ పచార్లు చేసాడు. ఆగి ఏదో చెప్పాలనుకుని నోరు తెరిచి మళ్ళీ ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. తన రివాల్వింగ్ చెయిర్‌లో కూర్చున్నాడు.

"సీరియస్‌గా అడుగుతున్నావా?" అడిగాడు.

"నా జీవితంలో ఇంత సీరియస్‌గా నేనెప్పుడూ ఎవర్నీ ఏదీ అడగలేదు" చెప్పింది మైత్రి.

"ఏమిటి? దీనివల్ల నీకు ఒరిగేదేమిటి?"

"సాటి మనిషి బాగుపడుతున్నాడనే ఆనందం. అమాయక ఆడవాళ్ళని నాశనం చేయడనే సంతోషం. పైగా సుధీర్ ఇలాంటి చెడ్డ అలవాట్లుగల తండ్రి దగ్గర పెరిగి, పెద్దయ్యాక తను అవి అలవర్చుకోడనే నమ్మకం."

"ఇది అసాధ్యం?" చెప్పాడు బెనర్జీ.

"మొదటిసారిగా నేను చెప్పేది నమ్మడం ఆరంభించాక నువ్విచ్చిన జవాబిది, ఆల్‌రైట్. నీకివి అసాధ్యమయితే సుధీర్‌ని నీకు అప్పగించడం నాకూ అసాధ్యమే."

"డోంట్ బి ఇడియాటిక్."

"నన్ను ఏ పేరుతో అయినా పిలు. కానీ నా షరతది."

"నీకు ద్రోహం చేసినందుకు నా మీద పగ తీర్చుకునేంత కోపం ఉండాలి కానీ ఇలా నీవు నా బాగు ఎందుకు కోరుకుంటున్నట్లు?" అడిగాడు బెనర్జీ.

"నీ మీద జాలి."

"జాలా?"

"ఎదుటి మనిషి బలహీనతని అర్థం చేసుకోకపోతే కోపం, చేసుకుంటే జాలికలుగుతాయి" చెప్పింది మైత్రి.

ఆలోచనగా బెనర్జీ టేబుల్ మీదవున్న త్రిబుల్ ఫైవ్ సిగరెట్ పాకెట్‌ని అందుకున్నాడు. అందులోంచి సిగరెట్ తీసి పెదవుల అంధ్య ఉంచుకోబోతే చెప్పింది మైత్రి రౌద్రంగా.

"దాన్ని వెలిగించు. ఇక సుధీర్‌ని ఈ జన్మలో చుడలేవు నువ్వు, ఐ మీనిట్."

ఆమె వంక బెనర్జీ చిరాగ్గా చూసాడు. కొన్ని క్షణాలు ఆలోచించి, సిగరెట్‌ని పెదాల మధ్య ఉంచుకున్నాడు. లైటర్‌ని వెలిగించాడు.

మైత్రి నిశ్శబ్దంగా అతనివంకే చూడసాగింది. ఆమె మొహం లోని స్థిరత్వాన్ని, కాఠిన్యాన్ని గమనించాడు బెనర్జీ. లైటర్‌ని ఆర్పాడు. కొద్ది క్షణాల తర్వాత వెలిగించాడు. మళ్ళీ ఆర్పి వెలిగించాడు చివరికి లైటర్‌ని టేబుల్ మీద పడేసి, సిగరెట్‌ని తీసి డస్ట్ బిన్‌లో పడేసాడు.

'అది తన తొలి విజయం' అని అనుకున్న మైత్రి మనసులో ఎంతో సంతోషపడింది. సుధీర్‌ని స్వంతం చేసుకోవాలన్న బెనర్జీ నిర్ణయాన్ని బలపరిచే సంఘటన అది.

టేబుల్ మీదున్న సిగరెట్ పాకెట్‌ని అందుకుని దాన్లోని సిగరెట్లని బయటికి తీసి, లేచి, వాటిని మధ్యకి తెంపి డస్ట్‌బిన్‌లో పడేసి చెప్పింది మైత్రి. బెనర్జీ గుడ్లప్పగించి చూస్తుండిపోయాడు.

"టెంప్టేషన్‌కి దూరంగా ఉండటం ఈ ప్రయత్నంలో మొదటి పాఠం. ఇంకెప్పుడు సిగరెట్స్ కొనకండి."

"ఈ అలవాటు పధ్నాలుగేళ్ళ నాటిది" బలహీనంగా చెప్పాడు బెనర్జీ.

"కానీ తప్పదు. అలవాటు కేబిన్ లాంటిది. ప్రతిరోజూ దానితో ఒకోదారం సాలెపురుగులా పేనికొంటాం. చివరికి అందులో చిక్కుకుని దాన్ని ఛేదించలేం. నీ లంగ్స్‌ని ఇంకాస్త నికోటిన్ విషానికి గురిచేయవద్దు. సిగరెట్ తాగాలనిపించినప్పుడల్లా లైబ్రరీకో, దేవాలయానికో వెళుతుండు."

"యూ ఆర్ ఏన్ ఆన్ ఎస్యూమింగ్ లేడి. దీనివల్ల నీకు ఏం లాభం?"

"నా లాభం సంగతి మర్చిపో. నీకు లాభమే తప్ప నష్టం లేవని కదా నేను చెప్పేది." "ఆల్కహాల్ అయినా మానగలనేమో కానీ సిగరెట్ మానడం కష్టం"

"ఆల్కహాల్ కన్నా సిగరెట్టే మనిషికి ఎక్కువ హాని చేసేది. అలాగే ఈ క్షణం నుంచి మందు కూడా తాగకూడదా."

"అలాగే. మానాను" నవ్వాడు.

మైత్రి కూడా నవ్వింది.

"నీ వేషాలు నా దగ్గర కాదు? ఓ నెలరోజులు నువ్వు వీటికి దూరంగా ఉన్నావన్న సంగతి రూఢిగా తెలియాలి."

"వచ్చి మా ఇంట్లో నాతో ఉంటానంటావా ఏమిటి?"

"ఊహూ నీలా నేను బుద్ధితక్కువ దాన్ని కాను."

"పోనీ నేను మీ ఇంట్లో ఉండాలంటావా?"

"నేను బుద్ధిహీనురాల్ని కూడా కాను."

"నీకు ఇంకెలా రూఢిగా తెలుస్తుంది?" ప్రశ్నించాడు బెనర్జీ. ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నావో, లేవో చెప్పు."

"ఆ విషయం రేపు చెపుతాను."

"ఇదేమీ లక్షలు పోయే వ్యవహారం కాదు, రేపటిదాకా ఆలోచించడానికి. యస్ ఆర్ నో వెంటనే చెప్పచ్చు" చెప్పింది మైత్రి.

బెనర్జీ సమాధానం చెప్పలేదు.

"ఇప్పటికైనా అర్థమయిందా ఈ రెండు అలవాట్లుకి నీ వెంతగా బానిస అయావో. నేనేం అన్నం మానమనటం లేదు. రోజూ స్నానం చేయవద్దనటం లేదు. జస్ట్ సిగరెట్, మందు మానమంటున్నాను. వెంటనే నువ్వు సరే అనలేవు అనుకున్నాను. అంతే అయింది."

"అదికాదు మైత్రి - నన్ను.."

"నయాపైస చాలా విలువైంది, నీ దగ్గర ఆ నయాపైసా కూడా లేనప్పుడు, లక్షలు సంపాదించాక వందరూపాయలు కూడా నయాపైసకి కొరగాకుండా పోతుంది.."

"డబ్బు.."

"నేను చెప్పేది డబ్బుగురించికాదు. ఆరోగ్యం గురించి. ఆ నయాపైస లాంటిదే ఆరోగ్యం కూడా. నీ దగ్గర పరిపూర్ణ ఆరోగ్యం ఉండి నువ్వు కులాసాగా లేచి తిరుగుతున్నంత కాలం ఆరోగ్యం నీకు బలదూర్. రేపు అది దెబ్బతిన్నాక దాని విలువ నీకు తెలీదు. ఆ తర్వాత ఎంత తన్నుకున్నా వృథాగా ఖర్చయిన ఒక్క పైస కూడా తిరిగిరానట్లే, నీ ఆరోగ్యం ఈ జీవితంలో నీకు తిరిగి దక్కదు."

బెనర్జీ మైత్రి మాటల్లోని సీరియస్‌నెస్‌కి బదులు మాట్లాడలేక పోయాడు.

"నీ మొహంలోని ఆల్కహాలిక్ లైన్స్, కంటి కింద నల్లటి గీతలు ఎప్పుడయినా అద్దంలో చూసుకున్నావా? ఆల్కహాల్ లోంచి ఎంత ఆనందం పొందావో, అది నీ శరీరంలో అంతకు ఎన్నో రెట్లు అనర్థాన్ని కలిగించిందనే గ్రహింపు శక్తి నీకు లేదు. ఉన్నా నిర్లక్ష్యం. అవునా? ఈ మందుతో నీవు పాడుచేసుకునే ఆరోగ్యం ఆ తర్వాత ఎన్ని మందులు మింగినా బాగుపడదు."

"నాకూ అప్పుడప్పుడు మానాలనిపిస్తుంటుంది. కానీ మానలేను. బహుశ ఈ జీవితానికది సాధ్యపడదు."

"నీళ్ళలో మునిగిపోతున్న వాడికి ఓ తాడు కొసని ఆసరాగా విసిరితే, రెండో కొస కూడా విసరమన్నట్లుగా ఉంది నీవు చెప్పేది. వాటిని మానడం నీ వల్ల సాధ్యం కాదు. నేను సహాయం చేస్తానంటే వల్లకాదంటే ఎలా?" తీవ్రంగా చూస్తూ అడిగింది మైత్రి.

"నిజమే. నాకు వాటిని మానాలని ఉంది" గొణిగాడు.

"ఆ విషయం రుజువు చెయ్యి. మొదట ప్రయత్నం చెయ్యి. వీలుకాకపోతే అప్పుడు చూడచ్చు. నిజానికి మనిషికి సరిగ్గా ప్రయత్నిస్తే ఈ లోకంలో కానిదంటూ ఏం ఉండదు."

"నీ కర్థం కాదు మైత్రీ! ఎలా చెప్పాలో నాకు తెలీదు కానీ ఇప్పుడు రెండు ఆ సమయానికి కావాలనిపిస్తాయి. లేకపోతే వంట్లోని బాధ చెప్పనలవికాదు"

"అది పూర్తిగా వంట్లోని బలహీనత కాదు. తల్లోని బలహీనత నీ మెదడుని, నీ విల్‌పవర్‌ని నీ చెప్పుచేతల్లో ఉంచుకోగలిగితే వంట్లో ఏం కాదు."

తల విదిలించి చెప్పాడు బెనర్జీ.

"నా వల్ల కాదు."

"ప్రయత్నం చెయ్యటం కూడా?"

"అవును"

చిన్నగా నవ్వింది మైత్రి.

"నాకు తెలుసు. ఆ బలహీనతలు నీ పాలిట ఇనుప చొక్కాల్లాంటివి. విప్పలేవు, చింపలేవు. అవునా?"

"కరెక్టగా చెప్పావు"

"ఆల్ రైట్! అలాంటి చొక్కాని విప్పే ప్రొఫెషనల్ డాక్టర్ సహాయం తీసుకో"

"అంటే?"

"ఆల్కహాల్, సిగరెట్స్ మాన్పే క్లినిక్స్ మనకి అందుబాటులో ఉన్నాయి. ఓ దాంట్లో ఓ నెలపాటు చేరితే చాలు"

"క్లినిక్ లోనా?"

"అవును. నీలాంటి వాళ్ళకదే సరయిన దారి"

బెనర్జీ తనేం కోల్పోతున్నాడో ఆలోచించాడు. ఆల్కహాల్ ఇచ్చే చక్కటి కిక్కు, దానితోపాటు కంపెనీ కోసం వచ్చే మిత్రులు, వాళ్ళతో కులాసా సంభాషణ, వాళ్ళంతా తమకన్నా తనే ఎంతో అధికుడు అనేలా చూడటం, మాట్లాడటం, పొగడటం, 'బెనర్జీ చొక్కా మడత నలగనీడు'లాంటి మాటలతో తనకి మానసికానందాన్ని కలిగించడం, తనెంతో గొప్ప మేధావి అని అందుకే వ్యాపారాన్ని ఎంతో అద్భుతంగా అభివృద్ధి చేసాడనటం..

"ఇంక ఆలోచించొద్దు ఏభై దాటకుండా మృత్యువుతో దోస్తీ చేస్తావా లేక సహజ మరణం పొందేదాకా వృద్ధాప్యం దాకా బ్రతుకుతావా అన్నది ఇప్పుడు తేల్చాల్సిన సమయం వచ్చింది. నీలాంటి అలవాట్లున్న వ్యక్తి దగ్గరకి సుధీర్‌ని పంపలేను"

బెనర్జీకి సుధీర్ గుర్తొచ్చాడు. ఆ కుర్రాడి మొహం, నవ్వు గుర్తొచ్చాయి తన ముసలి వయసులో విశ్రాంతి తీసుకుంటుంటే, వ్యాపార సమస్యల మీద తన దగ్గరకి సలహా కోసం వచ్చే యుక్తవయస్కుడైన కొడుకు గుర్తొచ్చాడు.

"ఇలాంటి అలవాట్లు మనిషికి సేవకుల్లా పడివుండాలి కానీ నెత్తికెక్కే యజమానులు కాకూడదు. ఎంతోమంది మనుషులకి, ఎన్నో క్లిష్టమైన సన్నివేశాలకి తలవంచక చాకచక్యంగా పోరాడి గెలిచే మనిషి ఒక్క ఈ అలవాట్లకి తలవంచడం - అందులో ప్రాణం లేని అంగుళంన్నర సిగరెట్‌కి, అరడుగుకూడా లేని బాటిల్‌కి బానిసవడం ఏమైనా బావుందా?"

బెనర్జీ ఎన్నడూ ఊహించలేదు. ఎదురు చూడలేదు ఇలాంటి సన్నివేశం తనకి ఆసన్నమవుతుందని. అది వచ్చింది. అందువల్ల కలిగిన చికాకు తగ్గాలంటే అతను మామూలుగా చేసేపని, సిగరెట్ తాగలేకపోతున్నాడు. అది మరీ చికాకుని కలిగిస్తోంది.

"నే చెప్పేది పాటించడం నీకు అవసరమా లేక అనవసరమా అన్నది ముందు నిర్ణయించుకో. దాన్నిబట్టి నీకు సుధీర్ అవసరమో అనవసరమో ఆటోమేటిక్‌గా నిర్ణయం అవుతుంది.. నీకో సంగతి తెలుసా? ప్రపంచంలో సమర్థవంతమయిన సైనికుల్ని తయారుచేసేది అవసరమే. మనిషి విష్యంలోనయినా సరే పోరాడేది, గెలుచుకునేది ఒక్క అవసరం వల్లే. కొడుకు నీకు లగ్జరీనా, నెసెసిటీనా తేల్చుకో"

బెనర్జీ ఆమె వంక బేలగా చూస్తూ చెప్పాడు.

"నాకు రేపటిదాకా టైం కావాలి. లేదా ఈ విషయం ముందే చెప్పి ఉండాల్సింది. ఇలా ఇప్పటికిప్పుడు చెప్పి వెంటనే నిర్ణయించుకో అంటే నేను తెమల్చగలిగే విషయం కాదిది. నాకు నిజంగా టైం కావాలి"

తను అప్పటికే ఎక్కువ మాట్లాడి, బెనర్జీని బాగా ప్రెషరైజ్ చేసానని గుర్తించింది మైత్రి. అతన్ని ఆ స్థితిలో వదలడం మంచిదనిపించింది. దాంతో చెప్పింది.

"నాకెంతమాత్రం ఇష్టంలేదు నీకు టైమ్ ఇవ్వడం. టైమ్ ఇచ్చిన కొద్దీ ఆ అలవాటు సాలెగూడులో ఇంకా ఇంకా చిక్కుకుపోతుంటావు."

"కాని..."

"నీకు నిజంగా సమయంకావాలా లేక ఇది పలాయనవాదమా?"

"నిజంగా నాకు టైం కావాలి మైత్రీ! నువ్వన్నట్లుగా ఆడవాళ్ళ జోలికి వెళ్ళకుండా ఉండగలను. బట్ సిగరెట్, లిక్కర్ ఇంపాజిబుల్, ఆల్కహాలిక్‌ల కోసం నడిపే ఏదయినా క్లినిక్ లో చేరితే తప్ప.."

"అయితే నువ్వు రేపు సాయంత్రానికల్లా అలాంటి క్లినిక్‌లో చేరడానికి సిద్ధంగా ఉన్నావా, లేదా అన్నది ఆలోచించు."

"అలాగే"

గట్టిగా ఊపిరి పీల్చి వదిలాడు బెనర్జీ.

మైత్రి కుర్చీలోంచి లేచింది. వెంటనే మళ్ళీ కూర్చుని చెప్పింది.

"మర్చిపోయాను. ఇంకో విషయం."

"యస్?" అడిగాడు బెనర్జీ.

"ఫ్యాక్టరీలోని లేడీస్ బాత్ రూములు చాలా డర్టీగా ఉన్నాయి. మగాళ్ళవీ అదే పరిస్థితిలో ఉండచ్చు. వాటిని క్లీన్ చేయించి, డ్రైనేజ్ గొట్టాలు సరిగ్గా పనిచేసేలా చేసి, రోజూ ఫినాయిల్ చల్లి, కలరా ఉండలో, ఓడోనిల్లో ఉంచే ఏర్పాటు చేయించు."

"అవి చిన్న విషయాలు. జి.యం. ఫ్యాక్టరీ మేనేజర్స్ చూసుకుంటారు" చిరాగ్గా చెప్పాడు.

"వాళ్ళు నీకింద పనిచేసే వాళ్ళు కాబట్టి నీకు చెపుతున్నాను. నువ్వు వాళ్ళకి ఇన్‌స్ట్రక్షన్స్ ఇస్తే నో అనరుగా?"

"ప్రతినెలా ఓడోనిల్స్ కొంటున్నట్లుగా కేష్ బిల్, ఓచర్స్ పాస్ చేస్తున్నానే?"

"అయితే వాటిని ఎవరు తింటున్నారో విచారణ చేయించు. ఇక నుంచీ ఫ్యాక్టరీ విషయాల్లో నువ్వు మనిషిలా గుండెతో ఆలోచించు. వర్కర్స్ లాయల్టీని మించిన పెట్టుబడి ఏ దేశంలో ఏ కేపటలిస్ట్‌కీ లభించదు."

"నువ్వివాళ నాకు కొత్త మైత్రిగా కనిపిస్తున్నావు" చెప్పాడు బెనర్జీ ఆశ్చర్యంగా.

"గుడ్ డే"

మైత్రి లేచి బయటికి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళగానే ఇందాక నోట్లో పెట్టుకుని డస్ట్‌బిన్‌లో పారేసిన సిగరెట్‌ని వెదికి తీసుకుంటూండగా లోపలికి వచ్చాడు విశ్వం.

"అదేం పని?" అడిగాడు ఆశ్చర్యంగా.

సిగరెట్‌ని వెలిగించుకుని ఊపిరి తిత్తులనిండా పొగని పీల్చి వదిలాడు బెనర్జీ.

"ఆ మైత్రి మితిమీరుతోంది. చూస్తుంటే వర్కర్స్ యూనియన్ పెట్టేట్లుగా ఉంది."

"అలాగా?"

"అవును. కేంటీన్‌లో పదార్థాలు బాగాలేవని, ఇంకా ఇతర విషయాలమీద ఓ రిప్రజెంటేషన్ ఇస్తుందిట. వర్కర్స్ సంతకాలు దానిమీద ఉంటాయట"

తల పంకించాడు బెనర్జీ. తర్వాత చెప్పాడు.

"అర్జెంట్ గా నాకోపెగ్ ఇవ్వు"

దాన్ని కలిపి ఇచ్చి అడిగాడు విశ్వం.

"ఏమిటి ఏదో సీరియస్‌గా ఆలోచిస్తున్నట్లున్నావు?"

"ఏం లేదు"

"ఇవాళ సాయంత్రం మనం బెంగుళూరు వెళుతున్నాం."

"గుర్తుంది. రేపు ఉదయం అక్కడ అమృత ఫుడ్ ప్రొడక్ట్స్ ఉద్యోగితో ఇంటర్వ్యూ.. బైదిబై ఫ్యాక్టరీ బాత్ రూంలు క్లీన్‌గా లేవా?"

"ఎవరన్నారు?"

"ప్రతినెలా మనం ఓడోనిల్స్ కొంటున్నాం కదా?"

"అవును"

"అవి ఏమవుతున్నాయి?"

విశ్వం మొహంలో క్షణకాలం రంగులు మారాయి. వెంటనే జవాబు చెప్పలేదు. "ఇక మీదట అలా జగకుండా చూడు" చెప్పాడు బెనర్జీ ఇక వెళ్ళచ్చన్నట్లుగా.

అతను బయటకి వెళ్ళాక మరో పెగ్ వంచుకున్నాడు బెనర్జీ.

ఆఫీస్ వర్కర్స్ యూనియన్ ఎంత పెద్ద సమస్యయినా, దానికన్నా పెద్ద సమస్య అయిన తన అలవాట్లని మానుకోవడం గురించి ఆలోచిస్తున్నాడు. అనసూయ ఎన్నోసార్లు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి.

'ఆ పాడు లిక్కర్‌ని మీరు తాగుతున్నారనుకుంటున్నారు. కానీ నిజానికి అదే మిమ్మల్ని తాగుతోందండి, మీ ఆరోగ్యం ఏం కాను?'

బెనర్జీ తన చేతిలోని గ్లాసులో ఉన్న సోడా కలిపిన విస్కీని కొద్దిసేపు చూసి, గ్లాసెత్తి దాన్ని గటగటా తాగేసాడు.

✷✷✷

***(ఇంకా ఉంది)***

Post your comments